వేగాన్ని వదిలేశారు!

యథేచ్ఛగా స్పీడ్ గవర్నర్స్ ఉల్లంఘన

హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త

ఆర్టీఏకు వచ్చే ప్రతి రవాణావాహనానికి వేగ నియంత్రణ పరికరం ఉంటేనే ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించాలి. రోడ్డు భద్రత దృష్ట్యా పదేళ్ల క్రితమే కేంద్రం ఈ నిబంధన తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఈ నిబంధన సమర్థంగా అమలుకు నోచడంలేదు. వాహన యజమానుల నిర్లక్ష్యం, కొంతమంది ఆర్టీఏ అధికారుల ఉదాసీనత కారణంగా వేగ నియంత్రణపై నీలి నీడలు కమ్ముకొన్నాయి. దీంతో రవాణా వాహనాలు అన్ని రకాల రహదారులపై యథేచ్ఛగా పరిమితికి మించిన వేగంతో పరుగులు తీస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్లపై రక్తపుటేరులు పారిస్తున్నాయి. ప్రతిఏటా ఓవర్ స్పీడ్ కారణంగా జరుగుతున్న ప్రమాదాల సంఖ్య ఆందోళన కలిగిస్తున్నప్పటికీ.. రవాణా అధికారులు,పోలీసులు ఎలాంటి పటిష్టమైన చర్యలు చేపట్టడంలేదు. ఇటీవల రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద చోటుచేసుకున్న ఆర్టీసీ బస్సు దుర్ఘటనకు టిప్పర్ ఓవర్‌లోడ్‌తో పాటు అతివేగం కారణమేనని రోడ్డు భద్రతా నిపుణులు పేర్కొంటున్నారు.

ఉన్నా, లేకున్నా ఓకే..

అన్ని రకాల రవాణా వాహనాలకు వేగాన్ని నియంత్రించే స్పీడ్ గవర్నర్‌ను 2015 అక్టోబర్ 1వ తేదీ నుంచి కేంద్రప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు ఆ సంవత్సరం నుంచి తయారయ్యే వాహనాలు స్పీడ్ గవర్నర్‌లతోనే మార్కెట్‌లోకి విడుదల కావాలి. అప్పటికే రోడ్డెక్కిన వాహనాలకు మాత్రం తప్పనిసరిగా వేగ నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. 2015 నుంచే ఇది అమల్లోకి వచ్చినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల ఆలస్యంగా 2019లో ఈ నిబంధనను అమల్లోకి తెచ్చింది. కొత్తగా వచ్చేవాటికి తయారీ సమయంలోనే వేగనియంత్రణ పరికరాలను ఏర్పాటు చేస్తున్నందువల్ల పాత వాహనాలకు ఫిట్‌నెస్ సమయంలో వేగనియంత్రణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని షరతు విధించారు. కానీ ఈ నిబంధన అమల్లో పక్కదారి పట్టింది. కొంత మంది అధికారుల అక్రమార్జనకు స్పీడ్ గవర్నర్‌లు ఊతంగా మారాయి. ఆటోమొబైల్ రీసెర్చ్ ఇని స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ వంటి సాంకేతిక సంస్థలు ధ్రువీకరించిన కంపెనీలకు చెందిన స్పీడ్ గవర్నర్స్‌ను మాత్రమే వాహనాలకు ఏర్పాటు చేయాలనే నిబంధన విధించారు. ఈ మేరకు 37 సంస్థలకు ఆమోదం లభించింది.కానీ తెలంగాణలో కేవలం 3 కంపెనీలకు చెందిన స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటుకు మాత్రమే రవాణా అధికారులు అనుమతినిచ్చారు. ఆ మూడు సంస్థలతో ఒక అధికారి లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి సదరు అధికారి అండతో ఆ సంస్థలు సైతం స్పీడ్ గవర్నర్‌ల ధరలను అడ్డగోలుగా పెంచాయి. దీంతో వాహనదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. క్రమంగా ఈ పథకం లక్ష్యం నీరుగారింది. ఆ తర్వాత ఫిట్‌నెస్ పరీక్షల్లో ఈపరికరాలు ఉన్నా, లేకున్నా సామర్థ్య నిర్ధారణ, ధ్రువీకరణ యథావిధిగా కొనసాగింది. మరోవైపు అధికారుల ఒత్తిడితో స్పీడ్ గవర్నర్‌లను ఏర్పాటుచేసుకొన్న వాహనదారులు ఆ తర్వాత వాటిని తొలగించి యథావిధిగా దూకుడు పెంచారు.

హైవేలపై గంటకు 80, గ్రేటర్‌లో 60 కి.మీ వేగ పరిమితి

గాలికి వదిలేసిన నిబంధనలు
వాహన చోదకుల నిర్లక్ష్యం
కొందరు ఆర్టీఏ అధికారుల ఉదాసీన వైఖరి
రహదారులపై ప్రమాదాలు.. గాల్లో ప్రాణాలు
గంటకు 80కి.మీ పరిమితం..

- కేంద్ర మోటారు వాహన చట్టంలోని 118వ నిబంధన ప్రకారం రవాణా వాహనాలు హైవే లపై గంటకు 80 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వెళ్లడానికి వీల్లేదు. గ్రేటర్ పరిధిలో గంటకు 60 కి.మీ. వేగంతో మాత్రమే నడపాలి.
- అంబులెన్సులు, పోలీస్ వాహనాలు, ఫైరింజన్లు, 8 మంది ప్రయాణికులు (3500 కిలోలు) కలిగిన వాహనాలకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది.
- ఆర్టీసీ, స్కూల్‌బస్సులు, ప్రైవేట్ బస్సులు, క్యాబ్‌లు,ట్యాంకర్లు, చెత్త తరలింపు వాహనాలు, లారీలు, డీసీఎంలు, తదితర అన్నిరకాల ప్రయా ణికుల రవాణా, సరుకు రవాణా వాహనాలు తప్పనిసరిగా నిర్ణీత వేగాన్ని పాటించేలా స్పీడ్ గవర్నర్స్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.
- అపరిమితమైన వేగంతో దూసుకెళ్లే వాహనాలను అదుపు చేయడంలో డ్రైవర్లు విఫలం కావడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.
- 2015 తర్వాత తయారైన అన్ని రకాల రవాణా వాహనాలకు వాటి నిర్మాణ సమయంలోనే కంపెనీలు వేగాన్ని నియంత్రించే పరికరాలను ఏర్పాటు చేశాయి.
- 2015 కంటే ముందు తయారైన వాహనాలకు మాత్రం అలాంటి వేగ నియంత్రణ పరికరాలు లేవు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ స్పీడ్ గవర్నర్స్ నిబంధనను తప్పనిసరి చేశారు.



హైదరాబాద్ వార్త

ఈసారీ అమ్మాయిలదే హవా..!

*** ఇంటర్ ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా**
*** ఐదవ స్థానంలో రంగారెడ్డి *ఎప్పటి మాదిరిగా వెనుకబడిన హైదరాబాద్ జిల్లా**

హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి.ఈ పరీక్ష ఫలితాల్లో మళ్లీ అమ్మాయిల హవానే కొనసాగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బాలికలు ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మరోసారి సత్తా చాటారు. కాగా, రాష్ట్రస్థాయిలోనే ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 82.73 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇందులో బాలికలు 86.77 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 79.14 శాతం సాధించారు. రంగారెడ్డి జిల్లా 81.61 శాతం ఉత్తీర్ణతతో ఐదవ స్థానంలో ఫలితాలు సాధించింది. ఈ జిల్లాలో బాలికలు 85.99 శాతం, బాలురు 77.39 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్‌జిల్లా మరోసారి చతికిలపడి నిరాశే మిగిల్చింది. 11వ స్థానంలో నిలిచిన హైదరాబాద్-1 జోన్‌లో 74.42 శాతం ఉత్తీర్ణత సాధించగా ఇందులో బాలికలు 79.24 శాతం, బాలురు 70.06 శాతం ఉన్నారు.అలాగే 22వ స్థానంలోకి వెళ్లిన హైదరాబాద్-2లో మొత్తం ఉత్తీర్ణత 70.32 శాతం రాగా, ఇందులో బాలికలు 79.26 శాతం, బాలురు 60.96 శాతం ఉత్తీర్ణులయ్యారు. 15వ స్థానం పొందిన హైదరాబాద్-3 జోన్‌లో 73శాతం ఉతీర్ణత సాధించగా అందులో బాలికలు 80.03శాతం, బాలురు 65.61శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు. ప్రతి

ఏటా ఉత్తీర్ణతలో వెనుకబడిన హైదరాబాద్ జిల్లాను మూడు జోన్లుగా విభజించి ఫలితాలు ప్రకటిస్తున్నా.. ఏ జోన్‌లోనూ ఆశించిన ఫలితాలు రాకపోవడం గమనార్హం.

ఇక ప్రథమ సంవత్సరం ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయిలో మేడ్చల్ జిల్లా 77.31 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో బాలికలు 82.47 శాతం, బాలురు 72.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రంగారెడ్డిజిల్లా 76.38 శాతం సాధించి ద్వితీయ స్థానం పొందింది.ఇందులో బాలికలు 81.28 శాతం, బాలురు71.95శాతం ఉన్నారు.ఇక 8వ స్థానంలో హైదరాబాద్-1 జోన్ 67.20శాతం, 17వ స్థానంలో హైదరాబాద్-2 జోన్ 62.17 శాతం, 10వ స్థానంలో హైదరాబాద్-3 జోన్ 65.39శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ మూడు జోన్లలో కూడా అమ్మాయిల హవానే కొనసాగింది.

డెకరేషన్ సామాగ్రి గోదాంలో అగ్నిప్రమాదం

హైదరాబాద్ ఏప్రిల్ 12,ప్రభాతవార్త : అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న శివరాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.సర్వారెడ్డి కాలనీ ప్రాంతంలో ఉన్న డెకరేషన్ సామాగ్రి గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం, ఆ గోదాంలో డెకరేషన్ సామాగ్రి నిల్వ ఉంచారు. ప్లాస్టిక్ వస్తువులు, ఫ్లెక్సీలు, థర్మాకోల్‌వంటి వస్తువులు ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లోనే భారీగా వ్యాపించాయి. మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోదాం పక్కనే ఉన్న నివాస గృహానికి కూడా వ్యాపించాయి. పొగ దట్టంగా వ్యాపించడంతో స్థానికులు భయపడి వెంటనే తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ గోదాములో ఉన్న ప్లాస్టిక్ సామాగ్రి కాలిపోవడంతో దట్టమైన నల్లటి పొగ కాలనీ మొత్తం వ్యాపించి స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని రాజేంద్రనగర్ ఫైర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసి పెను ప్రమాదం నుంచి తప్పించారు. అధికారులు సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ అగ్నిప్రమా దానికిగల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్తినష్టం భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఏటిఎం నగదు దోపిడీ..రూ.1 కోటితో ఇద్దరు పరారీ

సంజీవరెడ్డినగర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: సికింద్రాబాద్‌లో చోటు చేసుకున్న ఏటీఎం నగదు దోపిడీ ఘటన కలకలం రేపుతోంది. క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు దాదాపు రూ.1 కోటి నగదుతో పరారైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. వాసిరెడ్డి, లతీఫ్‌గా గుర్తించిన ఈ ఇద్దరికి బోయిన్‌పల్లి కార్యాలయం నుంచి వివిధ ఏటీఎంలలో నగదు లోడ్ చేసే బాధ్యతలు అప్పగించబడ్డాయి. అయితే గత రెండు రోజులుగా వారు కనిపించకపోవడంతో అనుమానాలు తలెత్తాయి. సాధారణ ఆడిట్ సమయంలో ఈ విషయం బయటపడగా, ఎస్ఆర్ నగర్ పరిధిలోని కనీసం 8 ఏటీఎంలలో నగదు జమ కాలేదని అంతర్గత విచారణలో తేలింది. దీంతో ఏజెన్సీ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల ఆచూకీ కోసం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, డేటా రికార్డులను విశ్లేషిస్తూ గాలింపు చర్యలు చేపట్టారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న షాపుపై పోలీసులు దాడులు

నిందితుడి అరెస్టు..సిలెండర్ల స్వాధీనం

సరూర్‌నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: అక్రమంగా వంట గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న గ్యాస్‌స్టౌల రిపేరింగ్‌షాపుపై పహాడీషరీఫ్ పోలీసులు దాడులు చేశారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్‌ను ఖాళీ సిలిండర్లలో నింపుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి గ్యాస్ సిలిండర్లను, గ్యాస్ నింపే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని ఓ షాపులో అక్రమంగా వంట గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారని అందిన సమాచారం మేరకు పహాడీషరీఫ్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర లాతూర్‌కు ఎందిన దత్త బాబూరావు (28) అనే యువకుడిని అదుపులోకి తీసుకొని రెండు హెచ్‌పి, ఒక ఇండియన్, ఒక స్మాల్ ఖాళీ సిలిండర్, గ్యాస్ ఫిల్లింగ్ పైప్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తేలికగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఖాళీ చిన్న సిలిండర్లలో గ్యాస్‌ను నింపి అధిక ధరకు విక్రయించే వ్యాపారం చేస్తుంటాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విజయవంతంగా మూడునెలల రేషన్ పంపిణీ

-జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త: జిల్లాలోమూడు నెలల పాటు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్(పిడిఎస్) ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 8,40,345 రేషన్ కార్డులలో, సుమారు 4,21,868 కార్డులు ఆన్లైన్ ద్వారా సరుకులు పొందటంతో 50 శాతం పైగా పంపిణీ నమోదయినట్లు తెలిపారు.పోర్టబిలిటీ సౌకర్యం ద్వారా లబ్ధిదారులు సులభంగా రేషన్ పొందుతున్నారని, పంపిణీని 30 రోజుల పాటు విస్తరించి నిర్వహించడం వల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా సజావుగా జరుగుతోందన్నారు. ఈ నెలాఖరు నాటికి రేషన్ పంపిణీ పూర్తవుతుందని, కార్డుదారులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పౌర సరఫరా అధికారులు, సిబ్బంది పారదర్శకత, సమర్థవంతమైన పంపిణీ పై దృష్టి సారిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఇందిరా పార్కును కాపాడాలి

సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

ధర్నాచౌక్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త: ప్రజలకు ప్రాణవాయువును అందించే ఇందిరాపార్కును కాపాడాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో సేవ్ ఇందిరాపార్క్ పేరుతో ధర్నా నిర్వహించారు.ధర్నాకు సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతోకలసి నారాయణ ముఖ్యఅతిథిగా హాజర య్యారు.ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నగర నడిబొడ్డునఉన్న ఇందిరాపార్కుకు నిత్యం వేలాది మంది ప్రజలు నడక కోసం, వ్యాయామం కోసం వస్తూ ఉంటారని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం ఎంతగానో ఉపయోగపడే ఈ ఇందిరా పార్కు నిర్లక్ష్యానికి గురైందని, పార్క్‌లో మౌలిక వసతులు సరిగాలేవని, పార్కు పక్కనే మున్సిపా లిటీ డంప్‌యార్డ్ ఏర్పాటు చేయటంతో, అక్కడ నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.104 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఇందిరాపార్కులో గతం లోనే 30 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించా రని, ప్రస్తుతం కరాటే పేరుతో మరికొంత భూమిని ప్రైవేట్‌వారికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతు న్నట్లు సమాచారం ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇందిరాపార్కులో ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే కరాటే షెడ్డు నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధినిధులు కేటాయించటం సరికాదన్నారు.ఇందిరాపార్కును సంరక్షించి, పారిశుధ్యం మెరుగు పరిచి, ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే సం బంధిత అధికారులు ఇందిరాపార్కును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వి.ఎస్.బోస్, స్టాలిన్, వాకర్స్ అసోసి యేషన్ నేతలు రవీందర్‌రెడ్డి, నమో నారాయణ, విఠల్, మాజీ కార్పోరేటర్ బాబన్న, నర్సింగ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నారాయణ

ఏనుగుల ఎన్‌క్లోజర్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ జూ ఆధారిటీ ప్రతినిధులు

జూ పార్కు నిర్వహణ భేష్

సెంట్రల్ జూ ఆధారిటీ ప్రతినిధి బృందం

చార్మినార్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్ పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని నూట యాభై ఎన్‌క్లోజర్‌లను సెంట్రల్ జూ ఆధారిటీ ప్రతినిధి బృందం నాలుగు రోజుల పాటు పరిశీలించింది. ఏప్రిల్ నెల 8వ తేదీ నుంచి 11 వతేదీ వరకు నాలుగు రోజుల పాటు జూ పార్కులోని ఏనుగులు, పులులు, సింహాలు, చిరుత పులులు, ఎలుగు బంట్లు, మూషిక జింకలు, ఖడ్గ మృగాలు, జిరాఫీ, మొసళ్లు, పాములు, చిలుకలు, పక్షుల ఎన్‌క్లోజర్లతో పాటు 150 ఎన్‌క్లోజర్లలోని జంతువులు కోసం తీసుకుంటున్న పరిరక్షణ చర్యలు, జంతువుల ఆహారం,వైద్య సేవలు, పార్కింగ్,వేసవి కాలంలో జంతువుల కోసం తీసుకున్న ఏర్పాట్లు పరిశుభ్రత, మంచి నీటి వసతితో పాటు పలు అంశాలను సెంట్రల్ జూ ఆధారిటి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారులు కె.ఎస్.ఎస్.వి.పి.రెడ్డి,(పిసిసిఎఫ్ తమిళనాడు) వి.ఎస్.బర్‌దేకర్ (మహారాష్ట్ర) క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారులు కె.ఎస్.ఎస్.వి.పి.రెడ్డి, వి.ఎస్.బర్‌దేకర్ మాట్లాడుతూ జూ పార్కు నిర్వాహణ,పరిశుభ్రత,జంతువుల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు ఎంతో బాగున్నాయని తెలిపారు.జూ పార్కు డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్,జూ పార్కు డైరెక్టర్ జె.వసంత, డిప్యూటీ డైరెక్టర్ జె.మురళీధర్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎ హకీమ్,అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి,పిఆర్ఓ మహ్మద్ హనీఫ్‌తో పాటు పలువురు జూ పార్కు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూల్చివేతలు సరే..పర్మిషన్ ఇచ్చినోళ్ల సంగతేంటీ..?

*** హైడ్రా కూల్చివేతలపై జనాల్లో తీవ్ర చర్చ**
*** అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న**

హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: నగరంలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను రక్షి ంచే లక్ష్యంతో హైడ్రా కూల్చివేతలు జరుగుతున్నాయి. 2024 జులైలో హైడ్రా కూల్చివేతలు మెదలు కాగా.. ఇటీవల అమీన్‌పూర్, మియాపూర్, హఫీజ్‌పేట, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టారు. అయితే హైడ్రా కూల్చివేతలపై జనం నుంచి విమర్శలు వస్తున్నాయి.కూల్చివేతలు ప్రధానంగా పేద, మధ్యతరగతి వర్గాలపై ప్రభావం చూపాయని, ధనవంతులు, రాజకీయంగా ప్రభావవంతమైన వ్యక్తుల ఆస్తులను విస్మరిస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. ముందస్తు నోటీసులు ఇవ్వకపోవటం, రాజకీయ ఒత్తిడి వంటి కారణాలతో హైడ్రా వ్యవస్థ అబాసుపాలవుతోంది. సమర్థవంతమైన పునరావాస చర్యలు, పారదర్శకత, చట్టబద్ధమైన ప్రక్రియలు అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలపై పలు పిటిషన్లు దాఖలు కాగా.. తెలంగాణ హైకోర్టు సైతం కీలక సూచనలు చేసింది. హైడ్రా చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని, పారదర్శకతను నిర్ధారించాలని సూచించింది. వీకెండ్ కూల్చివేతలను సైతం హైకోర్టు తప్పుబట్టింది.

పర్మిషన్ ఇచ్చినోళ్ల సంగతేంటీ.?

ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను గుర్తించి నేలమట్టం చేస్తున్న హైడ్రా ప్రముఖుల కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. ఇలా అక్రమ కట్టడాల విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా దూకుడు ప్రదర్శిస్తుండటంతో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తున్నా అందుకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపైనా యాక్షన్ తీసుకునేందుకు ఎందుక వెనకడుగు వేస్తున్నారన్నది ప్రశ్నగా మారింది.గతంలో ఆరుగురు ఆధికారులపై సైబరాబాద్ పరిధిలో కేసులు కూడా నమోదయ్యాయి. అలాగే కూల్చివేతల సమయంలో హెచ్ఎండీఏ, ఇరిగేషన్ శాఖ అనుమతి ఇవ్వడంతోనే తాము కట్టడాలు చేపట్టామని భవన నిర్మాణదారులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు.తమ దగ్గర కరెంట్ బిల్లు, వాటర్‌బిల్లు, టాక్స్ వంటి అన్ని పత్రాలు ఉన్నప్పటికీ ఎందుకు కూల్చివేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అలాగే బిల్డింగ్ కట్టేటప్పుడు టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కళ్లు కనిపిండచం లేదా అనుమతి లేకుంటే అప్పుడే అడ్డుచెప్పకుండా అన్ని పూర్తయ్యాక వచ్చి కూల్చివేస్తామంటే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో గవర్నమెంట్ ల్యాండ్స్, ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో కట్టడాలకు అనుమతిచ్చిన అధికారులు ,క్షేత్రస్థాయి సిబ్బందినిపైనా చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి రాకుండా ఉంటుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమీన్‌పూర్‌లోఆక్రమణల తొలగింపు.. 861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త: అమీన్‌పూర్ ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్ దాదాపు పూర్తి కావాల్సి వచ్చింది. శనివారం ఉదయం మొదలు పెట్టిన కార్యక్రమం రాత్రి వరకు కొనసాగింది. రాత్రి పూట ఆపేసి ఆదివారం ఉదయం మళ్లీ హైడ్రా ప్రారంభించింది. ముఖీం సోదరుడు అజీమ్ అక్రమంగా నిర్మించిన 6అంతస్తుల భవనం 90 శాతం తొలగింపు పూర్తిచేశారు. అలాగే పక్కనే ఉన్న అపార్టుమెంట్లకు ఎలాంటి నష్టం జరగకుండా హైడ్రా జాగ్రత్తలు తీసుకుంది. దీంతో అక్రమ భవనం కూల్చివేతకు సమయం పడుతోంది. అలాగే 861 ఎకరాల చుట్టు ఫెన్సింగ్ వర్క్ జరుగుతోంది. హైడ్రాఅధికారులు దగ్గరుండి ఈ ఆక్రమణ తొలగింపు, ఫెన్సింగ్ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఉప్పల్‌లో ఐపిఎల్ మ్యాచ్‌లు.. ట్రాఫిక్ అంక్షలు

ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే భారత ప్రీమియర్ లీగ్ ఐపిఎల్ - 2026 క్రికెట్ మ్యాచ్‌లు సందర్భంగా ట్రాఫిక్ అంక్షలు విధించినట్లు ట్రాఫిక్ డిసిపి ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాచ్‌లో జరిగే తేదీల్లో అనగా ఈనెల 13, 18, 21, మే 3, 6, 22 ట్రాఫిక్ అంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. మ్యాచ్ సందర్భంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున అంక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా రేపు భారీ వాహనాలకు అనుమతిలేదని, లారీలు, రాకెట్ లారీలు, దంపర్లు, ఎర్త్ మూవర్స్, ట్రక్కులు, టిప్పర్లు, వాటర్ ట్యాంకర్లు,ఆర్ఎంసి వాహనాలు, జెసిబిలు, ఐచర్ వాన్లు, ప్రైవేట్ బస్సులు, ట్రాక్టర్లు అనుమతి లేదన్నారు.13వ తేదిన మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు నాగోల్ నుండి హబ్సిగూడ (ఉప్పల్ జంక్షన్ మార్గం), బోడుప్పల్ నుండి అంబర్‌పేట్(ఉప్పల్ జంక్షన్, రామంతాపూర్ మార్గం) వరకు మోస్తరు ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని కోరారు. మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకులు తిరిగి తమ గమ్య స్థానాలకు చేరుకోవడానికి ఆర్టీసి బస్సులు, మెట్రో రైలు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగించాలని కోరారు.

పలు చోట్ల ట్రాఫిక్ దారి మళ్లింపు...

ఘట్‌కేసర్ నుండి ఉప్పల్ వైపు వచ్చే హెవీ వాహనాలను మెహఫిల్ హోటల్ వద్ద ఉప్పల్ భగ్యాత్ ప్రవేశద్వారం వద్ద నాగోల్ ఎల్.బి.నగర్ వైపు మళ్లించబడతాయని తెలిపారు.ఎల్.బి.నగర్ నుండి ఉప్పల్ వైపు వచ్చే హెవీ వాహనాలను నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యుటర్న్ తీసుకుని నాగోల్, ఉప్పల్ భగాయత్, టయోటా, బోడుప్పల్, చెంగిచెర్ల, చెర్లపల్లి, ఘట్‌కేసర్ వైపు మళ్లించబడతాయని తెలిపారు. తార్నాక నుండి ఉప్పల్ వైపు వచ్చే హెవీ వాహనాలను హబ్సిగూడ రోడ్ వద్ద నాచారం, రోటరీ, చెర్లపల్లి, ఘట్‌కేసర్ వైపు మళ్లించబడతాయని తెలిపారు. రామంతాపూర్ నుండి ఉప్పల్ వైపు వచ్చే హెవీ వాహనాలను స్ట్రీట్ నం. 8 వద్ద హబ్సిగూడ రోడ్, నాచారం, చెర్లపల్లి, ఘట్‌కేసర్‌వైపు మళ్లించబడతాయని తెలిపారు. వరంగల్ నుండి హైదరాబాద్‌కు ఉప్పల్ మార్గం ద్వారా వచ్చే హెవీ వాహనాలు ఘట్‌కేసర్ వద్ద ఒఆర్ఆర్ ఎక్కి అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్.బి.నగర్, దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో ప్రయాణించాలని సూచించారు. హైదరాబాద్ నుండి వరంగల్ వైపు ఉప్పల్ మార్గం ద్వారా వెళ్లే వాహనాలు ఎల్.బి.నగర్, హయత్‌నగర్ ద్వారా అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఒఆర్ఆర్ ఎక్కి వరంగల్ చేరుకోవాలని సూచించారు.

పార్కింగ్ కోసం స్థలాలు...

క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మొత్తం 5 ప్రధాన పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు డిసిపి తెలిపారు. వీటిలో నాలుగు స్టేడియం బయట 500 మీటర్ల పరిధిలో సాధారణ ప్రజల కోసం ఉండగా, ఒకటి స్టేడియం లోపల విఐపి పాస్ హోల్డర్లకు మాత్రమే కేటాయించబడిందని తెలిపారు. స్టేడియం బయట పార్కింగ్ ప్రదేశాలు ఉప్పల్ చౌరస్తా నుంచి హబ్సిగూడవైపు, పెంగ్విన్ నుంచి రామంతాపూర్ వైపు, డిఎస్ఎల్ మాల్ ఓపెన్ ప్రదేశం, మోడర్న్ బేకరీ స్టేడియం లోపల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు స్వంత వాహనాల్లో కాకుండా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఉపయోగించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

నితిన్ నబీన్‌తో డాక్టర్ వీరపనేని పద్మ

నితిన్ నబీన్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న వీరపనేని పద్మ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో కలిసి బీజేపీ మహిళ మోర్చ జాతీయ నాయకురాలు, తమిళనాడు రాష్ట్ర ఎన్నికల ఇంచార్జి డాక్టర్ పద్మ వీరపనేని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆమె ఆదివారం బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు నాయనర్ నాగేంద్రనతో కలిసి పర్యటించారు. ముగ్గురు కలిసి వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని బీజేపిని గెలిపించాలని కోరారు. తమిళనాట బీజేపీ గెలుపు ఖాయమని ఆమె ఆశాబావం వ్యక్తం చేశారు.

తోడుగా నడవడమే అసలైన నాయకత్వం
రచయిత విశ్వానంద్ పట్టార్

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 12, ప్రభాతవార్త : ఆధునిక కాలంలో నాయకత్వానికి కొత్త నిర్వచనం అవసరమని, కమాండ్ అండ్ కంట్రోల్ విధానాలు ఇకపై పనిచేయవని ప్రముఖ హెచ్‌ఆర్ నిపుణుడు, రచయిత ప్రొఫెసర్ డా. విశ్వానంద్ పట్టార్ అన్నారు. ఆయన రచించిన కాంప్రహెన్సివ్ గైడ్ టు లీడర్ షిప్:వాక్స్ బిసైడ్స్ నాట్ అహెడ్ ఆర్ బిహైండ్ పుస్తకాన్ని జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకంలో నాయకత్వాన్ని ఆధిపత్యంగా కాకుండా, సహచరులతో కలిసి ప్రయాణించే ప్రక్రియగా వివరించారు. నాయకుడు కేవలం ఆదేశాలు ఇచ్చేవాడు కాకుండా, లాంతరు పట్టుకుని దారి చూపే వ్యక్తిలా ఉండాలన్నారు. బృందానికి స్పష్టత, నమ్మకం కల్పిస్తూ వారితో పాటు నడవడం నాయకుడి ప్రధాన బాధ్యత అన్నారు. పుస్తకంలో మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా, అబ్రహం లింకన్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, మదర్ థెరిసా వంటి మహనీయుల నాయకత్వ శైలులను ఉదాహరణలుగా ప్రస్తావించారు. నాయకత్వానికి సాన్నిధ్యం, నమ్మకం, ఉమ్మడి లక్ష్యం, సమిష్టి సృష్టి, అభివృద్ధి, ఉత్సవం అనే ఏడు స్తంభాలను ముఖ్యంగా ప్రస్తావించారు. ఈ పుస్తకం నాయకులు, కోచ్‌లు, అధ్యాపకులు, సంస్థల ఉన్నతాధికారులు, భవిష్యత్తు నాయకులుగా ఎదగాలనుకునే వారికి మార్గదర్శిగా ఉపయోగపడుతుందని అన్నారు.

ఆలోచింపజేసిన జ్యోతిబాపూలే నాటక ప్రదర్శన

మహాత్మా జ్యోతిబాపూలే నాటక ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త) : కుల నిర్మూలన సాంస్కృతికోత్సవాల్లో భాగంగా సింధూర కల్చరల్ అసోసియేషన్(ఒంగోలు) వారు ప్రదర్శించిన జ్యోతిబాపూలే నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆలోచింప జేసింది. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈప్రదర్శనను ఉద్దేశించి కేంద్ర కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ మాట్లాడారు. డి.విజయ్‌కుమార్ రచనలో, పాటిబండ్ల ఆనందరావు దర్శకత్వంలో రెండున్నరగంటలపాటు సాగిన ఈ నాటకం సామాజిక చైతన్య స్ఫూర్తిని నింపిందని కొనియాడారు. బుద్ధుని తర్వాత భారత దేశంలో అలుముకున్న అజ్ఞానపు చీకట్లను ఛేదించిన అక్షర సూర్యులు పూలే దంపతులని వినయ్ కుమార్ అభివర్ణించారు. మనువాద కోరల్ని బద్దలు కొట్టిన సామాజిక విప్లవ కేసరి పూలే అని, పేశ్వాల పాలనలో అణచివేతకు గురైన దళితుల హక్కుల కోసం, స్త్రీ జాతి విముక్తి కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్కే) రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలేను మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్ది, ఎన్నో అవమానాలను భరిస్తూ విద్య ద్వారా విముక్తి మార్గాన్ని చాటిన సమతామూర్తి పూలే అని కొనియాడారు. వితంతువుల కన్నీళ్లు తుడుస్తూ, కులాంతర వివాహాల పునాదులపై సమాజాన్ని నిర్మించిన ఆయన ఆశయాలు నేటికీ ఆచరణీయమని అన్నారు. "విభజించే కులం వద్దు కలిపే మానవత్వమే ముద్దు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ నాటక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దాదాపు 40 మంది కళాకారులతో కూడిన ఈ అద్భుత దృశ్య కావ్యాన్ని విజయవంతం చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

కాంగ్రెస్ కమిటీ సికింద్రాబాద్ జిల్లా
ప్రధాన కార్యదర్శిగా మారిశెట్టి నర్సింగ్‌రావు

చిక్కడపల్లి, ఏప్రిల్ 12(ప్రభాతవార్త): కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా జవహర్‌నగర్‌కు చెందిన మారిశెట్టి నర్సింగ్‌రావును నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేసారు. ఆదివారం ఈ సందర్భంగా మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్‌యాదవ్‌ను, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్‌ను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మారిశెట్టి నర్సింగ్ రావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్ద మోహన్ రెడ్డి, బండారి నవీన్, రాజేష్, సుబ్బారావు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన వాకర్స్ క్లబ్ 2కే రన్

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త) : బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ 40 వసంతాల వేడుకలను పురస్కరించుకుని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి నేతృత్వంలో 2కే రన్ జరిగింది. సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు సాగిన ఈ పరుగులో 200 మందికి పైగా వాకర్స్ ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సుందరయ్య పార్క్ వద్ద ప్రారంభమైన ఈ పరుగును క్లబ్ ప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. నడక ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, సామాజిక ఐక్యతను పెంపొందించడమే ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు నాగభూషణం, ఏవీపీ మురళీ కృష్ణ, మాజీ ఏవీపీలు దామోదర్ రెడ్డి, సంపత్ రెడ్డి, డీజీఈ శైలజ మోహన్, మాజీ అధ్యక్షులు పి.వి. నిరంజన్ రెడ్డి, ఎస్. రమేష్ రెడ్డి, ఎస్. శ్రీనివాస్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి ఎం. దశరథ్, ఖజాంచి రవి కుమార్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ పాల్గొన్నారు.


వాకర్స్ క్లబ్ 2కే రన్‌లో పాల్గొన్న మనోహర్‌రెడ్డి తదితరులు

భద్రాద్రి రామునికి జరుగుతున్న అపచారాలను సరిదిద్దాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: భద్రాద్రి ఆలయంలో శ్రీరామచంద్రమూర్తికి జరగుతున్న అపచారాలను సరిదిద్దాలని శ్రీరామభక్త బృందం నేతలు విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి రామాలయంలో జరుగుతున్న అపచారాలను వివరిస్తూ, ఆదివారం శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అన్నదానం చిదంబర శాస్త్రి అధ్యక్షతన ట్యాంక్‌బండ్ పైనున్న భక్తరామదాసు విగ్రహానికి వినతిపత్రం సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, విశ్వహిందూ రక్షా పరిషత్ అధ్యక్షులు యమునాపాఠక్‌లు హాజరై, రామదాసు విగ్రహానికి పూలమాల వేసి, శ్రీరామభక్త బృందంతో కలసి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భద్రాద్రి రాముని కళ్యాణోత్సవంలో గత దశాబ్ది కాలంగా శ్రీరామచంద్రుల వారిని రామనారాయణుడు అంటూ, సీతాదేవిని సీతామహాలక్ష్మి అంటూ ప్రవక్తలు సైతం మార్చి చదువుతూ, క్షత్రియుడైన శ్రీరామునకు శర్మ అనే పేరు కలిపి, బ్రాహ్మణుడిగా కళ్యాణం నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరంగం నుంచి మమ్మల్ని రామదాసే అర్చకులుగా తీసుకువచ్చారని అబద్ధాలు ప్రచారం చేసుకుంటూ, శివద్వేషులైన వారు రామదాసుచే ప్రతిష్టించబడిన శివలింగను సైతం పెరిగి గోదావరిలో పారవేశారని తెలిపారు. రామదాసు ఏర్పరిచిన సేవా కైంకర్యాలను సైతం అర్చకులకు అనుకూలంగా మార్చేసుకుంటూ, ముద్రిత గ్రంథాలలో కొన్ని పేజీలు తయారుచేసి, దూర్చి చరిత్ర

మాట్లాడుతున్న స్వామి స్థితప్రజ్ఞ

ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఏ ఆగమము, వైష్ణవాగమాలు కూడా చెప్పని విధంగా పాటిస్తూ ఆగమశాస్త్ర విరుద్ధంగా ప్రవర్తిస్తూ, అన్ని రామాలయాలలో ఇలాగే మారుస్తామని సవాళ్లు విసురుతున్నారని తెలిపారు. ప్రభుత్వం దీనిపై స్పందించి, అర్చకుల చర్యలను సరిచేసి, భక్త రామదాసు ప్రారంభించిన సేవలు సక్రమంగా యధావిధిగా కొనసాగే విధంగా చూడాలని కోరారు. యమునా పాఠక్ మాట్లాడుతూ భద్రాద్రి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించటం అభినందనీయమని, అదే విధంగా రామాలయంలో మూలవిరాట్‌కు జరుగుతున్న ఘోర అపచారాలను సైతం సరిదిద్దేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరాముల వారి గోత్ర, నామ, ప్రవరలు మార్చి వేయటమే కాకుండా స్వామి వారి అస్థిత్వాన్నే దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ అయోధ్యగా పిలువబడే భద్రాద్రిలో సాక్షాత్ కంచర్ల గోపన్న వంశీయులే అవమాలు ఎదుర్కోవలసి వచ్చిందని, కేవలం ఒక వ్యక్తి తన పేరులో ఉన్న నారాయణను ఆధిపత్యంతో, కుట్రపూరితంగా శ్రీరాములవారి పేరుతో కలిపి, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. భక్తుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ప్రభుత్వం స్పందించి, భద్రాద్రిలో జరుగుతున్న ఘోర అపచారాలను సరిచేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తేజస్వీ శర్మ మాట్లాడుతూ భద్రాద్రిలో జరుగుతున్న అపచారాలపై 2018 నుంచి అనేక విధాలుగా న్యాయ పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. 2020లో 22 హిదూ సంఘాలను కలుపుకొని, భద్రద్రి శ్రీరామ చంద్రసేన పేరుతో ఒక జేఏసీ ఏర్పాటుచేసుకుని, కరోనా సమయంలో కోర్టుకు వెళ్లవలసి వచ్చిందని, అక్కడ కూడా తీర్పు వెలువడకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం భద్రాద్రి ఆలయ సుందరీకరణకై చర్యలు చేపట్టిన శుభసందర్భంలో శ్రీరామచంద్ర నామంతోనే సమస్త కైంకర్యాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల వెంకట రమణ, జమలాపురం శ్రీనివాసరావు మరియు శ్రీరామభక్త బృందం నేతలు పాల్గొన్నారు.

బిసి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి

ఎంపి ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మూసాపేటలోని అంజయ్య నగర్ శ్రీ సీతారాముల కళ్యాణ మండపంలో భాగ్యనగర్ తెలుకుల గాండ్ల సంక్షేమ సంఘం రజతోత్సవ(సిల్వర్ జూబ్లీ) వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సంఘం అధ్యక్షులు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగిస్తూ, బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల్లో అత్యంత వెనుకబడి ఉన్న తెలుకుల గాండ్ల కులాలను ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు కల్పిస్తూ, కార్పొరేషన్ ద్వారా తగిన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

మాట్లాడుతున్న కృష్ణయ్య

చేశారు. సంఘ కార్యకలాపాల నిర్వహణకు 500 గజాల స్థలాన్ని వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సంఘానికి న్యాయం జరిగేలా పోరాడతానని భరోసా ఇచ్చారు. సంఘం అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా సంఘం అనేక పేద కుటుంబాలకు అండగా నిలిచిందని, భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు కుసుమ అప్పలస్వామి, వాసుదేవరావు, రామకృష్ణ, సెక్రటరీ కృష్ణ, ఉపాధ్యక్షులు పూర్ణరావు, జాయింట్ సెక్రటరీ మూర్తి, కోశాధికారి మోహన్ రావు, అలాగే ముఖ్య సభ్యులు కర్లపూడి జోగారావు, సంజీవి మోహన్‌రావు, కొలతలు లక్ష్మణరావు, మెడికేర్ ఉమెన్స్ చైల్డ్ వరలక్ష్మి త్రి, వి. రాజు, కృష్ణ, అంగూర్ నరసింహ మూర్తి పాల్గొన్నారు.

నిరాశను వీడండి.. నిరంతరం శ్రమించండి
నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ టాపర్ బానోత్ లక్ష్మీ రచన

చిక్కడపల్లి ఏప్రిల్ 12 (ప్రభాతవార్త) : సమాజంలో నిరుద్యోగం అనేది ఒక సమస్య కావచ్చు, కానీ అది మీ జీవితానికి ముగింపు కాదు. మీలో ఉన్న శక్తి సామర్థ్యాలను మీరు నమ్మితే, ఆకాశమే హద్దుగా ఎదగవచ్చు అని యూపీఎస్సీ టాపర్ బానోత్ లక్ష్మీ రచన పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో విజన్ ఐఏఎస్ నిర్వహించిన ప్రత్యేకసదస్సు లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, తన విజయ ప్రస్థానాన్ని ఆశావహ అభ్యర్థులతో పంచుకున్నారు. నిప్పులో కాలితేనే బంగారం మెరుస్తుంది, కష్టాలను ఎదుర్కొంటేనే మనిషి రాటుదేలు తాడని అన్నారు. ఈ రోజు మీకు ఉద్యోగం లేకపోవచ్చు, కానీ రేపు మీరే వందల మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో ఉండవచ్చని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు సరిపోవు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని సలహా ఇచ్చారు. 2025లో నేను సాధించిన ఈ ర్యాంకు నా ఒక్కదాని విజయం కాదు.. పట్టుదలతో పోరాడితే సామాన్యులైనా అసాధారణ విజయాలు సాధించవచ్చని చెప్పడానికి ఒక ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ కృష్ణసింగ్ పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

చిక్కడపల్లి ఏప్రిల్ 12 (ప్రభాతవార్త) : వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక అచ్యుతరెడ్డి మార్గ్‌లో ఆదివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి చందన ముఖ్య అతిథిగా పాల్గొని మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని, ట్రస్ట్ నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లత,రమణ పాల్గొన్నారు.

నేడు ఉప్పల్‌లో సమానత్వం,సామాజిక న్యాయ సదస్సు

ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రత్న డా.బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రేపు సమానత్వం,సామాజిక న్యాయ సదస్సు జరుగుతుందని రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి.విజయ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి జల్దా విశ్వనాదజ్ కుమార్ తెలిపారు. డా.బీఆర్ అంబేద్కర్ రాసిన కులనిర్మూలన అనే పుస్తకం సమీక్ష రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి.విజయ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి జల్దా విశ్వనాదజ్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి, కవయిత్రి, రచయిత్రి జూపాక సుభద్ర విచ్చేసి రాష్ట్రస్థాయి పుస్తక సమీక్ష పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహించనున్నారని తెలిపారు. అనంతరం ఆమె మౌనం నుండి ప్రతిఘటన వైపు, మహిళలు మరియు కుల నిర్మూలన అనే అంశంపై మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డా.బండి రాజు ప్రజాస్వామ్యం మరియు సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ ప్రణాళిక అనే అంశం పై ప్రసంగించనున్నారని సభాధ్యక్షులు ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ తెలిపారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని సమన్వయ కర్తలు విజయ్ కుమార్, విశ్వనాదజ్ కుమార్ తెలిపారు.

మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్

జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలుస్తాం

చిక్కడపల్లి ఏప్రిల్ 12 (ప్రభాతవార్త) : బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల పురస్కరించుకొని ఆదివారం బాగ్‌లింగంపల్లిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారధి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. పార్థసారథి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జక్కా శ్రీను, ఎస్. జైపాల్ రెడ్డి, కె. ఉపేందర్, మంగళ, భాగ్యలక్ష్మి, కర్ణంబాబు, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గడ్డం సతీష్, కేశవ్, మాధవరెడ్డి, జట్కార్ శ్రీను, సుభాష్, బెజవాడ రవీందర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాత్విక స్కూల్ ఆఫ్ కర్నాటిక్ వోకల్ అండ్ భరతనాట్యం డాన్స్ స్కూల్ గురువు కమల నేమాని, డాక్టర్ సత్య నేమాని శిష్య బృందం ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర కచేరి మరియు భరతనాట్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించాయి. కర్ణాటక గాత్ర కచేరిలో గీతం, స్వరజతి, వర్ణం, పలుకే బంగారమాయెనా, శారదా అష్టకం పాటలను శ్రేయ, గాయత్రీ,అర్చితా, వేదం సంహిత జీవిక, ధీరజ్, ఆరాధ్య, లాస్య తదితరులు ఆలపించారు. భరతనాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, గణపతి గణపతి, తీస్ర అలరిపు, శ్యామల మీనాక్షి, గణపతి కౌతం, వందేమాతరం, ముద్దుగారే యశోద, అలరులు కురియగా తదితర అంశాలను కళాకారులు రాగిణి, వినిష, సద్విక, నందిని, బ్రహ్మిని, వేదసంహిత, సౌమ్య, నిత్య, వైష్ణవి, వందిత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

ఇంటి పన్నుల తగ్గింపునకు సహకరిస్తాం

మంత్రి శ్రీధర్‌బాబు

సరూర్‌నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసిలో విలీనమైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికంగా ఉన్న ఇంటి పన్నులను తగ్గించడానికి సహకరిస్తామని రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, శాసనసభ వ్యవహారాలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు హామీనిచ్చారు. భారీగా ఉన్న ఇంటి పన్నులను సవరింపజేయడానికి ముందుకు వచ్చి కాలనీ సంక్షేమ సంఘాలు, కాలనీవాసులతో కలిసి సమావేశం ఏర్పాటుచేసి ఇటీవల కార్యాచరణ ప్రణాళిక ప్రకటించిన జిల్లెలగూడ మాజీ ఉప సర్పంచ్, సీనియర్ నాయకుడు మేకల రవీందర్‌రెడ్డి ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసారు. వివిధ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులతో మంత్రిని కలిసిన ఆయన భారీగా ఉన్న ఇంటి పన్నుల వల్ల

వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. జూబ్లిహిల్స్, బంజారాహిల్స్ తదితర సంపన్న ప్రాంతాల కంటే ఎక్కువగా మీర్‌పేట్ కార్పొరేషన్ కాలనీల్లో ఉన్నాయని ఆయన వివరించారు. దీంతో స్పందించిన శ్రీధర్‌బాబు పెరిగి ఉన్న పన్నుల తగ్గింపుకు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ సర్కిల్‌కు పన్నుల తగ్గించే విషయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మేకల రవీందర్‌రెడ్డి బృందాన్ని సోమవారం డిసిని కలవాలని సూచించారు. అయితే తమ వినతికి స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబుకు రవీందర్‌రెడ్డి, కాలనీ సంఘాల అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు దుర్గాదాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి, బి.కృష్ణారెడ్డి, సుకుమార్, ఎస్‌ఎల్‌కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి
మరో యువకుడికి తీవ్ర గాయాలు

గచ్చిబౌలి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : గచ్చిబౌలిలో అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి మృతిచెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... జనగామ జిల్లా అప్పుగూడెం మండలం స్టేషన్ ఘనపూర్‌కు చెందిన ఐట యాదయ్య తన కుటుంబంతో నల్లగండ్లలోని డబుల్ బెడ్‌రూం సముదాయంలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని కుమారుడు ఐట ప్రభు కిరణ్(18) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా కిరణ్ శనివారం రాత్రి స్నేహితుడు విష్ణు(21)తో కలిసి(టిజి07 ఎఆర్1705)లో బయటకు వెళ్లాడు. విష్ణు బైక్ నడుపుతుండగా, కిరణ్ వెనుక కూర్చొని నల్లగండ్ల నుంచి గచ్చిబౌలి వైపు ప్రయాణిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియం గేటు 2వద్ద బైక్ యూటర్న్ తీసుకుంటుండగా, మితిమీరిన వేగంతో గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వస్తున్న బుల్లెట్ బైక్ (టిఎస్03 ఎఫ్‌బి8461) వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న కిరణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, బైక్ నడుపుతున్న విష్ణుకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని కిరణ్ మృతదేహాన్ని కొండాపూర్ ఆసుపత్రికి, గాయపడిన విష్ణును చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి విష్ణు తండ్రి యాదయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

తార్నాక, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : లాలాపేట్ పరిధిలో జరిగిన హత్య కేసులో లాలాగూడ పోలీసులు కీలక పురోగతి సాధించారు. పాత కక్షల నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం .... ఈ నెల 9 రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో లాలాపేట్ ఇందిరా నగర్‌కు చెందిన మన్నె మేఘమాల ఫిర్యాదు మేరకు లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో గాయపడిన మన్నె దిలీప్‌కుమార్(34) తార్నాకలోని మైహెల్త్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 10న మృతిచెందారు. దీంతో కేసులో సెక్షన్ 103(1) బిఎన్ఎస్‌ను కూడా జోడించి పోలీసులు విచారణను మరింత వేగవంతం చేశారు. దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, పాత విభేదాల కారణంగా లాలాగూడ లక్ష్మీనగర్‌కు చెందిన మజ్జిగ ఫణిందర్, లాలాపేట్‌కు చెందిన మజ్జిగ రాకేష్ కలిసి సాయి కుమార్‌పై దాడి చేసి, అనంతరం ఇందిరా నగర్‌లో మన్నె దిలీప్ కుమార్‌పై కర్రలతో దాడి చేసి హత్య చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో నిందితులను 12 తెల్లవారుజామున మల్కాజిగిరి సాయి రామ్ థియేటర్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు వారిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

రెండు రోజుల్లో 466 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 466 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరిలో 404 మంది ద్విచక్ర వాహనదారులు, 23 మంది త్రిచక్ర వాహనదారులు, 39 మంది ఫోర్‌వీలర్ వాహన చోదకులు ఉన్నారు. రక్తంలో ఆల్కహాల్ శాతం ఆధారంగా నమోదైన కేసుల వివరాలను పరిశీలిస్తే.. 30-50 మధ్య 97 కేసులు, 51-100 మధ్య 163 కేసులు, 101-150 మధ్య 108 కేసులు, 151-200 మధ్య 47 కేసులు, 201-250 మధ్య 34 కేసులు, 251-300 మధ్య 5 కేసులు మరియు 300పైన ఆల్కహాల్ శాతం నమోదైన వారు 12 మంది ఉన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని, ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జాయింట్ కమిషనర్ స్పష్టం చేశారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కోరుతోంది.

గంజాయి మత్తులో యువకుల దాడి..!

క్రైమ్ (సిసి కెమెరాలో నమోదైన యువకుల దాడి దృశ్యం)

హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : నగరంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్‌చేసింది. నగరంలోని కుల్సుంపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు యువకులు గంజాయి మత్తులో రెచ్చిపోయి వరుస దాడులకు పాల్పడ్డారు. మత్తులో ఉన్నవారిలో ఇద్దరు యవకులు బైక్‌పై జియాగూడలోని గౌతమ్ మోడల్ స్కూల్ సమీపంలోని ఓ సందులో అతివేగంగా వచ్చి, ఎదురుగా వచ్చిన ఆటో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. యువకులు ఆటోడ్రైవర్‌పై దాడి చేయడమే కాకుండా ఆటోలుఉన్న వృద్ధులపైనా దాడికి యత్నించారు. ఈఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన స్థానికులపై కూడా యువకులు దాడికి పాల్పడ్డారు. గంజాయి మత్తులో ఉన్న యువకులు మొదటి దాడితో ఆగకుండా, అనంతరం తమ గ్యాంగ్ సభ్యులతో కలిసి తిరిగి సంఘటన స్థలానికి వచ్చి మళ్లీ దాడులకు పాల్పడ్డారని బాధితులు పేర్కొన్నారు. భయంతో గేటు మూసుకున్నప్పటికీ, యువకులు గేటుపై రాళ్లతో దాడి చేయడంతోపాటు గేటుపైకి ఎక్కి ఇంట్లోకి చొరబడేందుకు యత్నించారని.. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని తెలిపారు.

ఫిర్యాదుదారుడిని మద్యం బాటిళ్లు అడిగిన ఎస్ఐ
సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వాయిస్ రికార్డింగ్
పోలీసు అధికారుల సీరియస్.. విచారణకు ఆదేశం

సరూర్‌నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ఫిర్యాదుదారుని నుండి మద్యం బాటిళ్లు అడిగిన ఓ ఎస్సై ఉదంతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పోలీసు ప్రతిష్టను మంట గలిపే విధంగా ఉన్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఈ మేరకు సదరు ఎస్సైను హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ అతని వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట్ పిఎస్ పరిధిలోని లెనిన్‌నగర్‌లో నివాసం ఉంటున్న తిరుపతయ్య తన ఇల్లు/షాపుపైన జరుగుతున్న నిర్మాణం, గొడవలపై కామోజీ ఈ నెల 5వ తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుల విచారణ సాగుతున్న క్రమంలో ఎస్ఐ నాగభూషణం శనివారం ఫోన్ చేసి రెండు టీచర్స్ మద్యం బాటిళ్లు కావాలన్నాడు. అర్జంట్ అవసరం వచ్చిందనీ ఎస్ఐ అనగా తిరుపతయ్య తాను అందుబాటులో లేనని అనడంతో పిల్లలు ఎవరూ లేరా? అని అడిగి లేరనడంతో ఫోన్ పెట్టేశాడు. ఈ సెల్‌ఫోన్ సంభాషణ శనివారం సాయంత్రం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం సంచలనమై కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల వరకు వెళ్లడంతో మ్యాటర్ సీరియస్ అయ్యింది. హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సజ్జనార్ ఆదేశాల మేరకు ఎస్ఐ నాగభూషణంను హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. జరిగిన ఘటన, నాగభూషణం వ్యవహారంపై విచారణ చేసి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని శంషాబాద్ డిపిసిని ఆదేశించినట్లు సమాచారం. నివేదిక తదుపరి సదరు ఎస్సై వ్యవహారం తేలనుంది. కాగా కేసును ఆసరాగా చేసుకొని సెల్ ఫోన్‌లో ఫిర్యాదుదారుడినే మద్యం బాటిళ్లు అడిగిన ఉదంతం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే ఈ ఘటనకు సంబంధించిన వివరాలు చెప్పడానికి స్థానిక పోలీసులు నిరాకరించారు.

సిఖ్ విలేజ్‌లో చలివేంద్రం ప్రారంభం

కంటోన్మెంట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బొలంరాయి సిఖ్ విలేజ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తనయుడు ముకుల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రాజేశ్ యాదవ్, బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నిజాంపేట్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త : నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంతర్గత రోడ్లు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, చెరువుల పునరుద్ధరణతో పాటు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ జంక్షన్ల ఆధునీకరణ పనులపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. అలాగే హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, నిరంతర నీటి సరఫరా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రూ.200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ఇప్పటికే ఆమోదం పొందినప్పటికీ టెండర్ ప్రక్రియలో నిలిచిపోయాయని, వాటిని వేగవంతం చేసి త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి, శాఖలవారీగా చేపట్టాల్సిన పనులపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనతో మాట్లాడి, పనులను త్వరలో ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జిమ్మీ దేవేందర్, బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో జ్యోతిరావు పూలె విగ్రహావిష్కరణ

విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నేతలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని దళిత బహుజన తత్వవేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నిరుడు కృష్ణ అన్నారు. అంబేద్కర్ నగర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్, ప్రధాన కార్యదర్శి మొగలిపాక పరశురాం, కార్యదర్శి ఎర్రగుంట్ల వెంకటేశ్వర్ ల ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, తోటకూర వజ్రేష్ యాదవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డ్‌సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల, ప్రజా సంఘాల, మహిళా సంఘ నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

బొల్లారం స్పోర్టింగ్ క్లబ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసే బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే .శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం బొల్లారం సదర్‌బజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న స్పోర్టింగ్ క్లబ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ స్పోర్టింగ్ క్లబ్ అభివృద్ధికి ఎల్లప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నేతలు నర్సింహన్ కన్నన్, వేణుగోపాల్‌రెడ్డి, ఖదీర్ వన్, క్లబ్ అధ్యక్షుడు మూర్తి, ఉపాధ్యక్షుడు పవీన్‌రాజ్, ప్రేమ్ కిరణ్, శ్యామ్,బాల్ రాజ్,కార్తీక్,రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరం..

కంటోన్మెంట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 7వ వార్డు లాల్‌బజార్‌కు చెందిన కాంగ్రెస్ నాయకురాలు నాగినేని సరిత ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో ప్రతిఏటా చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్న నాగినేని సరితను అభినందించారు.

సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ

మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

చార్మినార్, ఏప్రిల్ 12 ప్రభతవార్త : పాతబస్తీ దూద్‌బౌలిలోని మహరాజ్‌గంజ్‌లో ఆదివారం కామాటిపుర పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామాటిపుర పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారుగా విఠల్

చిక్కడపల్లి, ఏప్రిల్ 12(ప్రభాతవార్త): ప్రపంచ వ్యాప్తంగాఉన్న ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారుగా కొటికె విఠల్ అన్నారు. ఇందుకోసం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానాని అన్నారు. ఆదివారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారుగా కొటికె విఠల్ నియమితులైన సందర్భంగా సంస్థ సీనియర్ సభ్యులు చకిలం రమణయ్య ఆధ్వర్యంలో సత్కరించి ప్రసంగించారు. విఠల్ నియామకం సంస్థ బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ వైశ్య సమాజానికి విఠల్ అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, వారి కృషిని గుర్తించి ఈ పదవిని అప్పగించడం సంతోషదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో చకిలం రమణయ్యతో పాటు సింగిరికొండ నరసింహ, మదుపల్లి రవి గుప్తా, నేలంటి సత్యనారాయణ, చలపతి రావు, పి.వి. రమణయ్య, ఊర నరసింహ, మంచుకాంతి చిన్న భిక్షమయ్య, కొండూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ కమిషనర్‌పై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు

బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్

మాట్లాడుతున్న బాలగోని బాల్‌రాజ్‌గౌడ్

సైఫాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్‌పై తప్పుడు ఆరోపణలతో దుష్ప్రచారం జరుగుతున్నదని, దీని వెనుక కుట్ర దాగిఉందని తెలంగాణ బిసి పొలిటిక్ ఫ్రంట్ ఆరోపించింది. హరికిరణ్ రాష్ట్రంలో అక్రమ మద్యాన్ని అరికట్టి రాష్ట్ర ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు ఆదాయాన్ని తీసుకు వస్తుంటే, దీన్ని సహించలేని నాయకులు ఆయనపైన నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఐఎఎస్ అధికారని ముద్రవేసి ప్రాంతీయ విభేదాలు తెస్తున్నారని ఫ్రంట్ నాయకులు ఆరోపించారు. ఆదివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలు సృష్టించి పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కల్లు గీత వృత్తిని రాష్ట్రంలో కొనసాగనీయకుండా మాజీ సిఎం కెసిఆర్ కోట్లాది రూపాయలు దోపిడీ చేశారని, ఎంతో మందిని జైలుపాలు చేశారని, ఎక్సైజ్ శాఖ మంత్రిగా టి.పద్మారావు సైతం కంటనీరు పెట్టుకున్న సంఘటన ఉందని, నిన్న కెసిఆర్ నియోజకవర్గంలో 500 చెట్లు నరికివేస్తే నోరెత్తలేదన్నారు. డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి, రాష్ట్ర కమిషనర్ హరికిరణ్‌పై తప్పుడు ఆరోపణలు చేసి ఆసుపత్రిలో చేరారని, హరికిరణ్ చేసిన వ్యాఖ్యలలో వాస్తావాలు ఉన్నాయన్నారు. సోమిరెడ్డి హాయంలో ఒక కానిస్టేబుల్ సౌమ్య మృతిచెందిందని, అగ్రకుల ఆధిపత్యంకోసం సోమిరెడ్డి పాకులాడుతున్నారని, మూడు దశాబ్దాలపాటు ఆయన అవినీతి,అక్రమాలకు పాల్పడుతుంటే రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి ఏంచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టిలపై ఎవరైన తప్పుడు ఆరోప ణలు చేస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు.సమావేశంలో ఫ్రంట్ నాయకులు అయిలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణ గౌడ్, ఎలికట్టి విజయ్ కుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, భైరీ శేఖర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సరాబు వంశీకృష్ణ గుప్త

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా పాతబస్తీ ఉప్పుగూడ దానయ్యనగర్ నివాసి సరాబు వంశీకృష్ణగుప్త నియమితులయ్యారు. అసోసియేషన్ 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ శనివారం రాత్రి బేగంపేట్ పైగా ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2026-27కుగాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆలిగందుల నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా సరాబు వంశీకృష్ణగుప్త, కోశాధికారిగా కాసానగొట్టు సంపత్‌లు నియమితులయ్యారు. ముఖ్యఅతిథి డిప్యూటీకమిషనర్ ఆఫ్ పోలీసులు ధనారపు శ్రీనివాస్, విశిష్ట అతిథులుగా సంస్థ వ్యవస్థాపకులు వేలూరు రవీంద్రనాథ్‌గుప్త, అవినాష్ కాలేఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ అధినేత బ్రహ్మదేవుర అవినాష్‌లు హాజరైయ్యారు. కొత్తగా ఎన్నికైన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు నల్ల సంతోష్‌గుప్త, ఉపాధ్యక్షులు మాడిశెట్టి లక్ష్మదైత, సరాబు ఉదయ భాస్కర్‌గుప్త, అభిలాష్, విశాల్, వంశీ, అవినాష్, శివకృష్ణ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. ఇళ్లకే పరిమితమవుతన్న ప్రజలు

చార్మినార్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :

ఎండలు తీవ్రంగా మండుతుండటంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. మూడు రోజుల నుంచి ప్రజలు మండుతున్న ఎండలు వల్ల ఇండ్ల నుంచి బయటకు రావటం లేదు. ఉక్కపోత కారణంగా విపరీతంగా చెమటలు వస్తున్నాయి. చార్మినార్, మదీనా, శాలిబండ, సాలార్‌జంగ్ మ్యూజియం రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండలు నుంచి రక్షణ పొందటానికి ప్రజలు టోపీలు, గొడుగులు ధరిస్తున్నారు. పాతబస్తీ మదీనా సర్కిల్ మహ్మద్ క్యాప్ మార్ట్‌తో పాటు పలు దుకాణాలలో ప్రత్యేకంగా వేసవి కాలం సందర్భంగా పలు రకాల టోపీలు విక్రయిస్తున్నారు. ఎండలలో తిరగ వద్దని, ఇండ్లలో ఉండాలని వైద్యులు తెలియజేశారు. చిన్న పిల్లలు నుంచి పెద్దలు సైతం ఎండలో ప్రయాణం చేసే సమయంలో గొడుగులు పట్టుకుని తలకు టోపీలు ధరించి ప్రయాణం చేస్తున్నారు. ఆదివారం ఎండలు చాలా తీవ్రంగా ఉన్నందున ప్రజలు ఇళ్లకు పరిమితం ఆయ్యారు. ఎండలు కారణంగా ప్రజలు సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వస్తున్నారు.ఏప్రిల్ రెండవ వారంలోనే ఎండలు ఎక్కువగా ఉంటే మరి మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు భయపడుతున్నారు.

బౌద్ధనగర్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం

సికింద్రాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: హిందూ సమ్మేళనం దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హిందూ సమ్మేళనాలు నిర్వహించాలని ఆర్ఎస్ఎస్ హిందూ సమాజానికి పిలుపునిచ్చింది దాంట్లో భాగంగా బౌద్ధ నగర్ రామాలయం వద్ద ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి డాక్టర్ దేశబోయిన రఘు అధ్యక్షుడిగా వ్యవహరించారు. కన్నోజి భరద్వాజ్ కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశ్రీశ్రీ స్వామి అమృత పుత్రానంద పూరి ప్రధానవక్తగా, సిహెచ్ వి సాయి ప్రసాద్, శ్రీమతి కారెడ్ల రుక్మిణి, ప్రసంగించారు, ప్రత్యేక అతిథిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ విజయభారతి హాజరై ప్రసంగించారు. హిందూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల ఐకమత్యం అవశ్యకత, సంఘ ప్రయాణం, పంచ పరివర్తన గురించి హిందువుల్లో చైతన్యం అవశ్యకత గురించి వివరించారు. బిఎస్ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినటువంటి హిందూ బంధువులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడిగా రమేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: టీఎన్‌జీవో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగ వైద్యుడు డాక్టర్ పల్లాటి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. టీఎన్‌జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విక్రమ్, శ్రీనివాస్, కోశాధికారి బాలరాజుల నేతృత్వంలో సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల ముఖ్యఅధికారి కేఆర్ రాజ్‌కుమార్, సహాయ అధికారి ముఖీద్ ఖురేషీ తెలిపారు. మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుని గా రమేష్, కార్యదర్శి బీఏ అభినాష్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ కల్పన, కోశాధికారి అబ్దుల్‌అజీజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్బర్ట్‌బెన్ని, పబ్లిసిటీ సెక్రటరీ అఖిలేష్, ఈసీ సభ్యులుగా శ్యామ్‌కుమార్, అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కిరణ్‌రెడ్డి, సత్య నారాయణరెడ్డి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. టీఎన్‌జీవో హైదరా బాద్ జిల్లా ప్రతినిధులు నరేష్, శంకర్, వైదిక్‌శాస్త్ర, శ్రీధర్, వహీద్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సెంట్రల్ ఫోరం ప్రతినిధులు రాజేందర్, నర్సింహారెడ్డి, శివ, సత్యంరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

ఆర్టిజన్ కార్మికుల ధర్నా

హబ్సిగూడ టిజి ఎస్పీడిసిఎల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులు

ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : హబ్సిగూడ టీజీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆదివారం ఆర్టిజన్ కార్మికుల ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా టివిఎఇ జెఎసి రాష్ట్ర నాయకులు కొత్త బాబు, హబ్సిగూడడివిజన్ చైర్మన్ రాజేందర్‌నాయక్, సర్కిల్ నాయకులు బట్టపోతుల శ్రీను, కొత్త శ్రీరాములు, డి.శ్రీను, భరత్, చింత సంతోష్‌కుమార్, సంగీత, స్వప్న, హైమద్, పల్సర్ ప్రవీణ్, చైతన్య, అనిల్, ప్రసాద్, సంతోష్, జగన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులు మరియు మీటర్ రీడర్లు బిల్ కలెక్టర్స్, పీస్ రేట్ కార్మికులు పిఏలు, ఎస్పీఎం, అన్మాండ్, టిఆర్ కార్మికులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ యూనియన్లకు చెందిన ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ జెఎసి)గా ఏర్పడి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్న ప్పటికి ఇప్పటికీ ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా చూస్తుండడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. కన్వర్షన్ విధానంద్వారా తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగ హోదా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే వేతన సవరణలు చేపట్టి, ఏపీఎస్ఈబి నిబంధనలు అమలు చేయాలని, తమ అర్హతలకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికి బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాల ఆధారంగా కొనసాగించడం సమంజసంకాదని వారు మండిపడ్డారు. తక్షణమే సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో జేఏసీ ఆధ్వర్యంలో 5వ రోజు సమ్మె కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: సనత్‌నగర్‌లో భారతీయ యోగా సంస్థాన్ 60వ స్థాపన దివస్ సందర్భంగా ఆదివారం సెవెన్ టెంపుల్స్ ఆవరణలో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వలన ఆరోగ్య పరంగా అనేక ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువత వెస్ట్రన్ కల్చర్ వైపు మొగ్గు చూపుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ విదేశాల్లో భారతీయ సంస్కృతిని ఎంతో గౌరవంగా పాటిస్తూ పండుగలను ఘనంగా జరుపుకుంటున్నారని చెప్పారు. కరోనా మహమ్మారి తర్వాత ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవడం అవసరమని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని యోగా కేంద్రాలు ఏర్పడాలని, యోగా సాధకులకు అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్య క్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నిర్వాహకులు సుధీర్ కులకర్ణి, ఏఎస్ చారి, రేఖ, రవీందర్, శేషగిరిరావు, నాయ కులు సురేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, బాలరాజ్, గోపిలాల్ చౌహాన్, గులాబ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కంటోన్మెంట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: మహేంద్రహిల్స్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభని కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్. సునీత తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో 100శాతం, ఎంపీసీలో 97శాతంతో పాటు జి. తేజస్విని 993/1000, జి. సంజన 990/1000, ఎం. సంప్రీతి 989/1000, ఎం.వైష్ణవి 986/1000, ఎస్.అర్పిత 985/1000, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎన్. అనన్య 985/1000. కె.పూజిత 983/1000, కె.శృతి 981/1000, ఎం.తేజస్విని 980/1000, వి.నికిత 976/1000, డి. పూర్ణిమ 976/1000 టాపర్స్‌గా నిలిచారు. అలాగే ప్రథమ సంవత్సరం బైపీసీలో 97.2తో ఆర్. నికిత 437/440, హెచ్. వర్ధిని 437/440, బి. నిత్య శ్రీ 437/440, ఎన్. దుర్గా 436/440, ర దీపికా 436/440, డి. సింధు 436/440 టాపర్స్‌గా నిలిచారు. ఈ విజయాన్ని పొందిన విద్యార్థులను, దానికి తోడ్పడిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపల్, హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. సునీత అభినందించారు.

ఫలక్‌నుమా గురుకుల కళాశాల ప్రభంజనం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ (టిజిబిఐ) ఫలితాలలో పాతబస్తీ ఫలక్‌నుమా ఫారూక్‌నగర్ లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జెసి (సాంఘీక సంక్షేమశాఖ గురుకుల కళాశాల-బాలికలు) ప్రభంజనం సృష్టించింది. ద్వితీయ సంవత్సరం ఎంపిసి/బైపిసిల నుండి 76 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపిసిలో అత్యధికంగా కె.శ్రీనిధి (994/1000), కె.భవ్య (990/1000) మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. బైపిసిలో డి.మల్లీశ్వరి (981/1000), బి.అనుచందన (980/1000)లు విజయ కేతనం ఎగురవేశారు.ఇంటర్ మొదటి సంవత్సరంలో 142 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా 141 మంది (99.34 శాతం) ఫలితాలలో పోటీ పడ్డారు. ఒక్క విద్యార్థి తెలుగులో తప్పారు. ఐ.హారిక (438/440), ఎం.రోజా (436/440), ఎం.సంజనా (436/440), కె.మేఘన (436/440), జి.రాణి (436/440) మార్కులు తెచ్చుకున్నారు. 128 మంది ఏ గ్రేడు, 12 మంది బి గ్రేడు, ఇద్దరు సి గ్రేడ్ పొందారు. ప్రతిఏడు అద్భుతమైన ఫలితాలు సాధిచంటంలో విశేష భూమిక పోషిస్తున్న కళాశాల అధ్యాపకులను, విద్యార్థులను ప్రిన్సిపల్ వి.జయంతి అభినందించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించినవారిపై చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్ అసదుల్లాఖాన్

కంటోన్మెంట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డు వాల్మీకి నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఇటీవల ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ,ఎస్టీ జాతీయ కమిషన్, రాష్ట్ర కమిషన్‌లకు కంటోన్మెంట్ దళిత సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన,దిమ్మెను ధ్వంశం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో అసదుల్లాఖాన్ తెలిపారు.

ఉప్పల్‌లో బిజెపి నేతల బస్తీబాట

బస్తీబాటలో పాల్గొన్న బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని పణీందర్

ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ ఉప్పల్ డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ బిజెపి అధ్యక్షుడు మారినేని ఫణీంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు యు.బలవంత చారికి శంఖం అందజేసి బస్తీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉప్పల్ డివిజన్ గాంధీ నగర్‌లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీనగర్ నివాసితులను కలిసి కాలనీలో సదుపాయాలు, కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. బిజెపితోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవతుందన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ధర్మారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు, నామా శ్రవణ్, ఆకుల రిషికేష్, మద్దెల పద్మ, ఆడెపు రమేష్, అనంతు అచ్యుతరావు, యువ నాయకులు వెంకట్ సాయి, నవీన్ రాజా, అరుణ్, రవితేజ, అభిరామ్, రాజేందర్, మహేష్, సతీష్, ధన కృష్ణస్వామి, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక...

పార్టీలో చేరుతున్న శాంతినగర్ కాలనీ నేతలు

ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ న్యూ శాంతినగర్‌లో పలువురు కాలనీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పలువురు కాలనీవాసులు పార్టీలో చేరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు తగు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా న్యూ శాంతినగర్ అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సైదులు, ఉపాధ్యక్షులు పరశురామ్, సంయుక్త కార్యదర్శులు ప్రభాకర్, బి.శ్రీకాంత్, మాజీ అధ్యక్షులు లకన్, మాజీ అధ్యక్షులు గంట చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు మత్స్యగిరి, బి.యాదగిరి, ఉదయ్, నర్సింహా, మల్లయ్య, కృష్ణ, దర్శన్, ఉప్పలయ్య, మారయ్య, రాజు, సోమయ్య, సాయికుమార్, సత్తయ్య, శివ, జనార్దన్, కిష్టయ్య, సుదర్శన్, పూరషోత్తం చేరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, వెంకటేష్ గుప్తా, అలుగుల అనీల్ కుమార్, జనగాం రామకృష్ణ, అల్వాల భాస్కర్, నోముల సురేష్, మోహన్ నాయక్, రంగుల శేఖర్, శివ, ధనలక్ష్మి మ్మ, భవాని, మమత, రాణి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఈ-వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్

సరూర్‌నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల్లో భాగంగా జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ లో ఈ-వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి సమ్మయ్య ఆదేశాల మేరకు సర్కిల్‌లో ఎంపిక చేసిన నాదర్‌గుల్ డివిజన్ గుర్రంగూడ వార్డు ఆఫీస్, ప్రశాంతిహిల్స్ డివిజన్ నందిహిల్స్, జిల్లెలగూడ డివిజన్ గాయత్రీనగర్ సీనియర్ సిటిజన్ భవన్‌లో, మీర్‌పేట్ డివిజన్ మీర్‌పేట్ వార్డు ఆఫీస్‌లో, బడంగ్‌పేట్ డివిజన్‌లోని జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయంలో, బాలాపూర్ డివిజన్‌లోని పాత ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఈ వేస్ట్ సేకరణ శిబిరాలను నిర్వహించారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్ళల్లో పనికి రాని పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను, పరికరాలను అందజేశారు. ఈ మేరకు 155 కిలోల ఈ వేస్ట్‌ను సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ వేస్ట్ అందజేసిన వారికి రివార్డు పాయింట్లు ఇవ్వడం జరుగుతుందని వాటి ద్వారా నిర్దేశించిన స్టోర్‌లలోక కొనుగోలు చేసే వస్తువులకు డిస్కౌంట్స్ పొందవచ్చని తెలిపారు.

తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

భక్తులతో పొటెత్తిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం

కౌడిపల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం ఆదివారం నాడు భక్తులతో పోటెత్తి ఉంది. ఉదయం నుండియే భక్తుల తాకిడి పెరుగుతూపోయింది. తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివప్ప వేదమంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుళ్ల దరువుల నడుమ అమ్మవారికి భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్ట ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను పెట్టి, తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వచనం పొందారు. కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతుబలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవి ఎండ తీవ్రత రూపం దాల్చుతున్న సందర్భంలో ఆలయంకు విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా ఆలయ సిబ్బందితో మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచినంత విరాళాలు ఇస్తే భక్తులకు కాటేజ్‌లు నిర్మించబడుతాయని ఇంచార్జి ఈవో రంగ రావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరితో పాటు ఆలయం జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, గ్రామ పెద్దలు సాయాగౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన

హత్నూర ఏప్రిల్ 12, ప్రభాతవార్త : హత్నూర మండలం గోవిందరాజ్ పల్లి గ్రామంలో పారిశుద్ధం పై అవగాహన మరియు ప్లాస్టిక్ నిషేధం పై ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు గ్రామంలోని మహిళా సంఘాలు ప్రతి ఆదివారం సమావేశమై ఒక్కొక్క వార్డులో తిరుగుతూ ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ ఆదివారం సర్పంచ్ బండమీది రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించి గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం, పారిశుధ్యం పై ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణా గౌడ్, వార్డు సభ్యులు, సీసీ కిష్టయ్య వివో ఏ పోచమ్మ, అధ్యక్షురాలు భూలక్ష్మి ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, మహిళా సంఘం సభ్యులు

బాధిత కుటుంబీకులకు మాజీ ఎమ్మెల్యే రసమయి పరామర్శ

బెజ్జంకి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: మండల పరిధిలోని బెజ్జంకి ఎక్స్ రోడ్ గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల శ్రీకాంత్ యాదవ్ మాతృమూర్తి మేకల కనకవ్వ మృతి చెందగా బాధిత కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు లేని నిరుపేద వధువుకు పుస్తెమట్టెలు బహుకరించిన : కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన తల్లిదండ్రులు లేని నిరుపేద యువతి వివాహ నిమిత్తం ఆదివారం 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం దంపతుల చేతుల మీదుగా పుస్తెమట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేసినప్పుడే జీవితంలో నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. భవిష్యత్‌లో పేదలను ఆదుకోవడానికి తన వంతుగా మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. తల్లిదండ్రులు లేని నిరుపేద నూతన వధువుకు పుస్తెమట్టెలు బహుకరించిన కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం దంపతులకు కుటుంబీకులు, చెప్యాల కిట్టు, శివ, బాబు, ధర్మం శివ కృతజ్ఞతలు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం

-రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి

పుల్‌కల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: మండల కేంద్రమైన పుల్‌కల్ గ్రామానికి చెందిన అవుసలి లక్ష్మణ్, పాండురంగంలకు చెందిన పూరిండ్లు ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదంలో అహుతయ్యాయి. అగ్నికి ఇంట్లోని సరుకులు కాలిబూడిదవగా కట్టు కట్టబట్టలతో కుటుంబ సభ్యులు బయటపడ్డారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నేత, రాష్ట్ర ట్రేడ్ కార్పోరేసన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కుటుంబాల సభ్యులకు బిక్షపతి 5వేల చొప్పున ఇరువురు సోదరులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం, నెలకు సరిపడు నిత్యావసర సరుకులను అందచేశారు. పుల్‌కల్ సర్పంచ్ చిరంజి లావణ్య కృష్ణారెడ్డి నెలకు సరిపోను నిత్యావసరర సురుకులు, వంట సామాగ్రి పంపిణి చేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు పరిహారం అదించి పక్కా ఇండ్లు మంజూరు చేయాలని మఠం బిక్షపతి డిమాండ్ చేశారు. మఠం బిక్షపతి వెంట సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు అవుసలి శ్రీనివాసచారి, మాజీ సర్పంచ్ దప్పూరి శ్రవణ్‌కుమార్, నాయకులు లస్కరి ఆంజనేయులు ముదిరాజ్, కప్పాటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న మాజీ చైర్మన్ బిక్షపతి

గుమ్మడిదలలో అంబేద్కర్ జయంతి వేడుకలు - రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు

గుమ్మడిదల ,ఏప్రిల్ 12, ప్రభాతవార్త : భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతోత్సవాలు మరియు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు తుడుం రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు, సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఈ ఉత్సవాలకు అతిథులుగా హాజరవ్వాలని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నాయకులకు అందజేసినట్లు అన్నారు. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలని, పెద్ద సంఖ్యలో రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సంఘం సభ్యులు దప్పు శ్రీనివాస్, తుడుం రాజు, తునికి సుధాకర్, ఎంటికే బాలేష్, దామెర నరేష్, కొత్తపల్లి రమేష్, తుంకి రాజు, ఎంటిక లింగం తదితరులు పాల్గొన్నారు.

పత్రికను అందిస్తున్న దృశ్యం

అంగడికిష్టాపూర్‌లో ఉచిత కంటివైద్య శిబిరం

మర్కుక్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త): మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో సర్పంచ్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. శిబిరంలో గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోలి నరేందర్, చింతల రామచంద్రం, వార్డు సభ్యులు మహేష్, నాగరాజు, శ్రీనివాస్, నాయకులు దుద్దెడ నర్సింలు, బాల్‌రెడ్డి, మల్లేశం, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలను అందజేస్తున్న దృశ్యం

సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో 5చోట్ల జంక్షన్‌లు ఏర్పాటు

జంక్షన్ లు ఆకర్షణీయంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చి దిద్దండి

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 12, ప్రభాత వార్త : సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం అవుతున్నాయి. రూ. 13 కోట్లతో చేపడుతున్న ఈ బై పాస్ రోడ్ లో ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు చేయాలని హెచ్ఎండిఏ అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో ఐబి గెస్ట్ హౌస్ మొదలుకుని బసవేశ్వర చౌక్ వరకు ఐదుచోట్ల జంక్షన్‌లు ఏర్పాటు కానున్నాయి. హెచ్ఎండిఏ అధికారులతో కలిసి జంక్షన్ లు ఏర్పాటయ్యే ఐబి చౌరస్తా ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ చౌరస్తాను ఆదివారం పరిశీలించారు. జంక్షన్‌లలో సుందరీకరణ పనులు చేయాలని, జంక్షన్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా జంక్షన్ ల డిజైన్ లు ఉండాలని కన్సల్టెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి కావాలని అధికారులకు జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ , హెచ్ఎండిఏ ఇంజనీర్ వెంకట్ పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

వైభవంగా అఖండ హరినామ కీర్తన

-శ్రీసీమ ఆంజనేయ తృతీయ వార్షికోత్సవం

సిర్గాపూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: మండలంలోని పంచముఖి గ్రామ శివారులోని శ్రీసీమ హనుమాన్ దేవాలయం తృతీయ వార్షి కోత్సవ ఉత్స వాలను పురస్కరించుకుని అఖండ హరనామ సప్త కార్యక్రమంలో భాగం గా మూడవ కీర్తన సేవ కార్యక్రమం .మహా రాష్ట్రలోని దేవాచి అళంది నుంచి నిరంజన్ మహారాజ్ చేరుకుని ఉత్స వాలు ఉత్స హంగా జరిగేలా చూశారు. ఆలయ ఆవరణలో హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా మహారాజ్ భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. రామ నామస్మరణతోనే మనసు ఉల్లాసంగా ఉంటుం దన్నారు. ఉత్స వాలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారిని సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

వర్గల్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త): మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ హనుమాన్ స్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ గ్రామంలోని పురాతన హనుమాన్ దేవాలయం పునర్నిర్మాణం, స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్స వాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గత నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్ట మహోతవాలు కన్నుల పండుగగా గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, స్వామివారి కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పురోహితులు రవీంద్రశర్మ, గురుస్వామి అంజాగౌడ్, దాతలు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాపై ఆరోపణలు చేయడం సరికాదు

చట్టసభల్లో మాట్లాడిన విషయంపై బయట చర్చలు తగదు

మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు

నర్సాపూర్, ఎప్రిల్ 12, ప్రభాతవార్త : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పై కొందరు స్వయం ప్రకటిత మేధావులు ఆరోపణలు చేయడం సరికాదని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. ఆదివారం బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలో బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ 2011 సంవత్సరంలో అప్పట్లో ఉన్న సుప్రీంకోర్టు జడ్జి ఇచ్చిన జడ్జిమెంట్ వల్ల నక్సలిజం పెరగడానికి ఎంతో దోహద పడిందని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పార్లమెంట్లో మాట్లాడడంపై అప్రకటిత మేధావులు అమీత్ షాపై కేసు నమోదు చేయాలని మాట్లాడడం సరికాదన్నారు. అంతేకాక అమీత్ షాపై కోర్టు ధిక్కరణ కేసులు కూడా నమోదు చేయాలని అనడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి అమీత్ షా హోం మంత్రి హోదాలో నక్సలిజాన్ని రూపుమాపేందుకు పార్లమెంట్లో ప్రస్తావించాడు తప్ప మరే మి కాదన్నారు. అంతేగాక చట్టసభల్లో రాజ్యసభల్లో పార్లమెంట్లో సభ్యులు మాట్లాడిన విషయాలపై బయట చర్యలు తీసుకోవద్దని భారత రాజ్యాంగంలో రాసి ఉందని చెప్పారు. అలాంటిది అమిత్ షా పార్లమెంట్లో మాట్లాడిన విషయంపై బయట కొందరు మేధావులు మాట్లాడడం సరికాదన్నారు. ఈ మేధావులు చేసిన అమీత్ షా పై చేసిన వాక్యాలు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం అయితే బిజెపి నాయకులు కార్యకర్తలు ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ కౌన్సిలర్లు శ్రీకాంత్ నిరంజన్ దాస్, సీనియర్ బిజెపి నాయకులు పెద్ద రమేష్ గౌడ్, నాయకులు ఆంజనేయులు గౌడ్ నారాయణరెడ్డి చంద్రయ్య, రాజు,రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఐదో రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల సమ్మె

పటాన్ చెరు, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : విద్యుత్ ఆర్టిజన్, మీటర్ రీడర్లను, పీస్ రేట్ కార్మికులను, ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించాలని, రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు 9 సంఘాలతో ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా నిరోధక సమ్మె ఆదివారం నాటికి ఐదోవ రోజుకు చేరుకుంది. పటాన్ చెరు విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ఈ సమ్మెలో నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ప్రభుత్వం స్పందించకపోతే వినూత్నంగా నిరసనలు చేపడుద్దామని, అలాగే రాష్ట్రంలో విద్యుత్ అంతరాయాలు ఏదైనా సంఘటన చోటు చేసుకుంటే పూర్తి బాధ్యత యాజమాన్యం ప్రభుత్వం వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు, రాష్ట్ర నాయకులు భూపాల్ రెడ్డి డివిజన్ నాయకులు రఘు పర్వయ్య మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు అడగడంలో తప్పు లేదని అది కార్మికుల హక్కు అని ప్రభుత్వం కార్మికులతో చెలగాటమాడుతుందని హక్కులు సాధించేవరకు వెనక అడుగు వేయమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉమాకాంత్, సాయి గౌడ్, అరుణ్ రెడ్డి, శ్రీనివాస్, గౌస్, రబ్బ, కవిత, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

విద్యతోనే వజ్రంలాంటి భవిష్యత్

కొల్చారం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరికీ విద్యతోనే వజ్రంలాంటి భవిష్యత్ నిర్మాణం సాధ్యమని సహన సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో దివ్యాంగుల సమావేశం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో సహన సంస్థ జనరల్ సెక్రటరీ మంజుల మాట్లాడుతూ సహన సంస్థ లక్ష్యాలు మరియు గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్యంగా బాలల హక్కుల పరిరక్షణపై సంస్థ ప్రత్యేకంగా పనిచేస్తుందని తెలిపారు. సున్నా నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకోవాలని, పిల్లలు వెట్టిచాకిరికి గురికాకూడదని, బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాల్సి న అవసరం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల్లో అంతరించి పోతున్న సాంప్రదాయ కళలకు జీవం పోయడం కూడా సంస్థ ప్రధాన సంకల్పమని తెలిపారు. తబల తాళం కొట్టడం, కోలాటం, జడకొప్పు, వీణ వాయించడం వంటి కళలను గ్రామాల్లో ఉన్న పెద్దలు పిల్లలకు నేర్పించాలని కోరారు. గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు సమాచారం అందించడం కూడా సంస్థ ముఖ్య లక్ష్యమని చెప్పారు. సంస్థ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విద్యకు సంబంధించిన అన్ని సౌకర్యాలు మెరుగ్గా ఉండాలంటే గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు, అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, యువత కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అప్పుడు మాత్రమే విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి పాశం రమేష్, గంగవ్వ, వాశ్రం నాయక్, భిక్షా నాయక్, లక్ష్మి ్మ, సుబేదా, మల్లేష్, బాచుపల్లి, పండుగల భూమయ్య, స్వరూప, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ సత్యనారాయణ దృశ్యం

నూతన వధువరులను ఆశీర్వదించిన యువ నేత సాగర్ శెట్కార్

మనూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: మండల కేంద్రమైన మనూర్ గ్రామానికి చెందిన కీర్తి శేషులు సిరూర్ రాంగొండ కుమారుడి వివాహం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహ కార్యక్రమానికి కాంగ్రెస్ యువ నేత సాగర్ శెట్కార్ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సాగర్ శెట్కార్ వెంట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్ పటేల్, తిమపూర్ సర్పంచ్ గరక్ పటేల్, నందు, సతీష్, మోహన్‌రెడ్డి, అంజయ్య, విటల్, మారుతి, దూల్గొండ, శంకర్,, వెంకట్, సురేష్ తదితరులు ఉన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న సాగర్ శెట్కార్ దృశ్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న లబ్దిదారులు.

ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఎప్రిల్ 12, ప్రభాతవార్త : నారాయణఖేడ్ మండల పరిధిలోని చప్టా(కె) గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన చిన్నమ్మ (భర్త శంకరయ్య స్వామి) నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, యువనేత సాగర్ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, యువనేత నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారురాలు చిన్నమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగయ్యస్వామి, కాలనీ 9వార్డ్ మెంబర్ నందు, 3 వార్డ్ మెంబర్ పండరి రెడ్డి, చప్టా(కె)గ్రామస్తులు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సింగూర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ,ఎమ్మెల్యే సునీత రెడ్డి బహిరంగ లేఖ

నర్సాపూర్ ఎప్రిల్ 12, ప్రభాతవార్త : సింగూరు జలాల విడుదలపై అధికారుల సమన్వయ లోపంతో నెలకొన్న సందిగ్ధతను తొలగించి, పంట చివరి దశలో ఎండిపోతున్న వరి పంటలను సింగూర్ నీటిని వెంటనే విడుదల చేసి ఘనపూర్ ఆనకట్ట పరిధిలోని రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ మేరకు ఆదివారం ఆమె రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ నీటి విడుదలపై అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. నీటి విడుదల చేయకపోవడంతో ఘనపూర్ ఆనకట్ట పరిధిలో సుమారు 60 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం పెట్టుబడులు పెట్టిన రైతులను అప్పుల పాలు చేయొద్దని. అప్పులు తెచ్చి పంటల పై పెట్టుబడులు పెట్టిన రైతులను ఆదుకోవాలని, పంటల చివరి తడి కోసం వెంటనే నీటి విడుదల కోసం లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి రాసిన లేఖలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి (ఫైల్‌ఫోటో)

మంగళపర్తి గ్రామంలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

వెల్దుర్తి , ఎప్రిల్ 12, ప్రభాతవార్త : మండలంలోని మంగళపర్తి గ్రామంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం నాడు విడుదల కావడంతో గ్రామానికి చెందిన చాకలి సాయిలు. నాగమణి దంపతుల కుమారుడు చాకలి సాయిరాం17 హైదరాబాద్ లో మొదటి సంవత్సరం సిఇసి గ్రూప్ కాగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో పోవడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి సాయిరాం తన సొంత ఇంట్లో ఎవరూ లేని సమయంలో కదులానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సోదరి మహేశ్వరి వివాహ ఏర్పాట్ల కోసం హైదరాబాద్ కు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కుమార్తె వివాహం ఉండగా. ఏకైక కుమారుడైన ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబంలో గ్రామంలో విషాదఛాయలు అమ్ములు ఉన్నాయి. సమాచారం అందుకున్న సంధ్యా రామకృష్ణారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫలితాల్లో కళాశాల టాపర్లుగా బి ఇందు. ఏ స్పందన

వెల్దుర్తి , ఎఫిల్ 12, ప్రభాతవార్త : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రాయరావ్ సరస్వతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నాడు విడుదలైన పరీక్ష ఫలితాల్లో కళాశాల టాపర్లుగా బి హిందూ సిఇసి. ఏ స్పందన బైపిసి ఇంటర్మీడియట్ సెకండియర్. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్లో జి అనుష బైపిసి బి తేజస్విని బైపిసి కళాశాల టాపర్లుగా నిలిచారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్ లో మొత్తం కళాశాలలో 115 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. అలాగే సెకండ్ ఇయర్ లో 50 మంది విద్యార్థులు అందులో విద్యార్థినిలు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మొదటి సంవత్సరం చదువుతున్న 38 మంది విద్యార్థినిలు పరీక్షలు రాయగ 38 మంది విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించారు .మొదటి ర్యాంకర్ గా మహాలక్ష్మి ్మ. సెకండ్ ర్యాంకర్ గా స్పందన. సుప్రియ లు బాలికల పాఠశాలలో టాపర్లుగా నిలిచారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

అల్లాదుర్గం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: ఇంటర్మీయట్ ఫలితాల్లో మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరంలో 85 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 74 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైన 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 107 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 66 మంది విద్యార్థులు కావడంతో 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తుకారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో 27 మంది విద్యార్థులకు గాను 27 మంది విద్యార్థులు, ఎంపిసి ద్వితీయ సంవత్సరంలో 27 మంది విద్యార్థులకు గాను 25 మంది విద్యార్థులు, సీఈసీలో 20 మంది విద్యార్థులకు గాను 19 మంది విద్యార్థులు, మొదటి సంవత్సరం బైపిసిలో 23 మంది విద్యార్థులకు గాను 23 మంది విద్యార్థులు, బైపిసిలో 20 మందికి 18 మంది, సీఈసీలో 35 మందికి 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

కొండాపూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త : కొండాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రతిభ కనబర్చారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని డి. నాగేశ్వరి 500 మార్కులకు గాను 474 మార్కులు సాధించి మెరుగైన ఫలితాన్ని సాధించింది. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాలలో కె. పూజ ఎం పీ హెచ్ డబ్ల్యు గ్రూప్ లో 1000 మార్కులకు గాను 965 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. విద్యార్థినుల ఈ విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ పి. కవిత, మండల విద్యాధికారి దశరథ్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అనాథల బాలికలకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

సిర్గాపూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: హైద్రాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంను పురస్కరించుకుని 10వ తరగతి పూర్తి చేసిన అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు విద్యను అందుకునేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ అదికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రాలు (అనాథ బాలికలు అయితేనే), కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రాలు (అనాథ బాలికలకు అవసరం లేదు), స్టడీ సర్టిఫికెట్, బోనఫయిడ్ సర్టిఫికెట్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేసి దరఖాస్తులు చేసుకోవాలని అధికారి సూచించారు.